క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 55, బెండ 28, పచ్చిమిర్చి 28, కాకర 23, బీర 18, క్యాబేజీ 13, ఫ్రెంచ్‌బీన్స్ 55, క్యారెట్ 28, దొండ 21–23, చిక్కుడు 65, గోకర 23, బీట్‌రూట్ 20, క్యాప్సికం 45, ఆలు 21, దోస 13, సార 13, పొట్ల 13, ఉల్లిగడ్డ 28, చామగడ్డ 35. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చాదర్‌ఘాట్ డీఐగా సీతయ్య



చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ డీఐగా ఎ.సీతయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. చాదర్‌ఘాట్ డీఐగా విధులు నిర్వహిస్తున్న రాఘవేందర్ బదిలీపై సైదాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా వెళ్లగా, ఆయన స్థానంలో సీసీఎస్ డీడీ విభాగం నుంచి సీతయ్య ఇక్కడికి వచ్చారు.

మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



మంత్రి మహేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న విఠల్‌రెడ్డి తదితరులు

చైతన్యపురి: చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, భూగర్భ గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏనుగు సుధీర్‌రెడ్డి, పవన్, గట్టు శ్రీనివాస్, రమణరెడ్డి, తిరుమల్ రెడ్డి, నరహరి, వీరన్న యాదవ్ పాల్గొన్నారు.

'సమేటి'లో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న హన్మంత్ కె.జెండాగీ

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని రాష్ట్ర వ్యవసాయ యాజమాన్య, విస్తరణ శిక్షణా సంస్థ (సమేటి) కార్యాలయంలో దేశీ ఫెసిలిటేటర్లకు రెండు రోజుల వర్క్‌షాప్ సమేటి డైరెక్టర్ జి.నారిమణి ఆధ్వర్యంలో గురు, శుక్రవారం రెండు రోజుల్లో పది సెషన్స్ ద్వారా అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో పాల్గొన్న దేశీ ఫెసిలిటేటర్లకు స్పెషల్ కమిషనర్ హన్మంత్ కె.జెండాగీ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మహంతేష్ షిరూర్, ప్రిన్సిపాల్ కోర్డినేటర్ డాక్టర్ షాలేంద్ర, డైరెక్టర్ డాక్టర్ జి. నవీన్ కుమార్, అకాడమిక్ అసోసియేట్ డాక్టర్ జి.శిల్ప తదితరులు పాల్గొన్నారు.

శబరిమల సమాచార కేంద్రం పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: రాష్ట్రం నుంచి ప్రతి ఏటా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం నగరంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు టీడీబీ అధ్యక్షుడు అడ్వకేట్ ఆనంద గోపాలన్ తెలిపారు. అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలోని దియా స్వాగత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు శబరిమల సమాచార కేంద్రం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ సమాచార కేంద్రం ద్వారా శబరిమలకు వెళ్లే ప్రతి భక్తుడు తమకు అవసరమైన సమాచారం తెలుసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18005719984ను ఆయన ప్రారంభించారు. టీడీబీ కార్యదర్శి బిజ్జు, శబరిమల మాజీ మేల్ శాంతి సుధీర్ నంబూద్రి, అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు శ్రీనివాస్, కళ్యాణ్ చక్రవర్తి, విఘ్నేష్ ఉన్నారు.

స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

మలక్‌పేట: సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రాత్రి మలక్‌పేట పీఎస్ పరిధిలోని ఓ స్పా సెంటర్‌పై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మూసారంబాగ్ మెట్రో స్టేషన్ సమీపంలోని స్పాసెంటర్‌లో గుట్టు చప్పుడు కాకుండా క్రాస్ మసాజ్ చేస్తున్నట్టు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ సీఐ చిట్టి బుర్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దాడిలో చైనాకు చెందిన ఆరుగురు మహిళలు, ఒక కస్టమర్, స్పా సెంటర్‌లో పని చేసే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్‌ఐ జయంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్పా సెంటర్ నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు.

నవరాత్రుల సందడి



హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మండపంలో 56 రకాల స్వీట్లతో గణేశుడికి నైవేద్యం

- గణేశునికి ప్రత్యేక పూజలు.. అన్నదానాలు
- నిమజ్జనానికి తరలుతున్న వినాయక విగ్రహాలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు ఎల్బీనగర్/మలక్‌పేట జోన్ల పరిధిలో వైభవంగా జరుగుతున్నాయి... వేడుకల్లో 6వ రోజైన శనివారం కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల వద్ద ఉత్సవాల నిర్వాహకులు, స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. విగ్రహాలను తరలిస్తున్న వాహనాల ముందు యువత, చిన్నారులు తీన్మార్ డప్పు చప్పుళ్లకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, పోలీసు అధికారుల మండపాలను సందర్శించి గణేశుడికి విశేష పూజలు చేశారు.

– ఎల్బీనగర్,మలక్‌పేట జోన్ బృందం



ఆర్కేపురం టెలిఫోన్ కాలనీలో.. యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు



పీ అండ్ టీ కాలనీలో.. రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



వీవీనగర్ కాలనీ గణపతి మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వేంకటేశ్వర కాలనీలో... కార్పొరేటర్ సుజాతానాయక్ తదితరులు



మాధవనగర్ ఫ్రెండ్స్ యూత్ మండపంలో.. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజనీ సాయిచంద్



ఎల్బీనగర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, పార్టీ నేత పేరాల శేఖర్‌రావు



వీరన్నగుట్టలో..బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి



నాగోలు నర్సింహస్వామి కాలనీలో.. ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



దిల్‌సుఖ్‌నగర్‌లో.. మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సన్మానిస్తున్న మండప నిర్వాహకులు



ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డిలను గణేశ్ మండపంలో సన్మానించిన కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి



హస్తినాపురం రేస్ డిగ్రీ ఉమెన్స్ కాలేజీలో... ప్రిన్సిపాల్ నిహారిక రావు, డైరెక్టర్ హరిణి గిరిధర్ తదితరులు



కొత్తపేటలో.. మాజీ కార్పొరేటర్ వజీర్‌ప్రకాశ్‌గౌడ్



ఆదిత్యానగర్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో... మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్నగౌడ్



వనస్థలిపురంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్

బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పలువురు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని ఈదులకంటి రాంరెడ్డిగార్డెన్స్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి ఆధ్వర్యంలో 200 మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రధాన లక్ష్యమైన తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు సాధించుకున్న తెలంగాణలో అన్ని రంగాలలో గొప్ప విజయాలను నమోదు చేసిందన్నారు. గడిచిన 9 ఏళ్లలో రాష్ట్ర తాగునీరు, సాగునీరు, సంక్షేమం, విద్యుత్, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో గొప్ప ప్రగతి సాధించిందన్నారు. బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నాయకులు హరీష్‌రెడ్డి, రోహిత్, సురేష్‌యాదవ్, మహేశ్, శ్రీహరి, శరత్, వేణు, ప్రశాంత్, శ్రీనిధితో పాటు 200 మంది చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గజ్జెల మధుసూధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్, ఉదయ్‌రెడ్డి, డేరింగుల కృష్ణ, కంచర్ల శివారెడ్డి, నల్ల నాగిరెడ్డి, సాయి, విజయ్, మహేశ్ పాల్గొన్నారు.

లడ్డూ వేలం



లడ్డూతో శేఖర్‌రెడ్డి

వనస్థలిపురం: హస్తినాపురం డివిజన్ విశ్వేశ్వరాయ ఇంజినీర్స్ కాలనీలోని కేఎస్‌ఆర్ రెయిన్‌బో అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని లడ్డూను అపార్ట్‌మెంట్ నివాసి సత్తు శేఖర్‌రెడ్డి రూ. 40,200 లకు వేలం పాటలో దక్కించుకున్నారు.

గణేశ్ లడ్డూల చోరీకి యత్నించిన ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ జలేంధర్‌రెడ్డి

హస్తినాపురం: గణేశ్ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా ఉత్సవ కమిటీ వారు రాత్రి సమయంలో తప్పనిసరిగా ఇద్దరు వ్యక్తులను కాపలా ఉంచాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేవ జలేంధర్‌రెడ్డి సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాల్లోని వినాయకుడి లడ్డూలను శనివారం తెల్లవారుజామున దొంగతనం చేసేందుకు యత్నించిన ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు. మన్సూరాబాద్ రాఘవేంద్రనగర్ కాలనీకి చెందిన గుడ్డేటి అజయ్ (19), బొడ్డుపల్లి మహేశ్ (19)లు శనివారం తెల్లవారు జామున 2 గంటలకు మన్సూరాబాద్ ప్రాంతంలోని గణేశ్ మండపాల్లోని లడ్డూను చోరీ చేసేందుకు రాగా కావేరి పృథ్వీరాజ్ అనే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మౌనదీక్షను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగారామ్

మలక్‌పేట: దివ్యాంగుల హక్కుల చట్టం –2016లోని అంశాలు అమలు కోసం అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున ఫెడ్ చైర్మన్ గంగారామ్ చేపట్టనున్న శాంతియుత మౌనదీక్షకు మద్దతుగా శనివారం మలక్‌పేట సూపర్‌బజార్ లూయిస్ బ్రెయిలీ పార్కులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఫెడ్ ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్రంలో వికలాంగుల సంఘాల నేతలు సి.గోపాల్, అందె రాంబాబు, కరుణాకర్, విద్యావతి, బాలరాజ్, నాగమణి, సత్యనారాయణ, మహబూబ్‌అలీ, శ్రీనుగౌడ్, ప్రజాసంఘాల నాయకులు గజం నర్సింగ్‌రావు, వసంత, ఉషారాణి, షణ్ముఖరావు హాజరయ్యారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి అందరూ కలిసి రావాలని గంగారామ్ పిలుపునిచ్చారు. వికలాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మౌనదీక్ష విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన మహిళా నేతలు

మలక్‌పేట: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో మలక్‌పేట మహిళా నేతలు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిశారు. ఈ సందర్భంగా శనివారం మూసారంబాగ్‌లో జాగృతి నాయకురాలు డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లపై హర్షం వ్యక్తంచేస్తూ, కవితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాభినందనలు తెలిపామన్నారు. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించడంపై సంతోషం వ్యక్తం చేశారు. జాగృతి మలక్‌పేట కన్వీనర్ తిరునగరి రాధ కేసీఆర్ సేన అధ్యక్షుడు జగన్నాథం ప్రవీణ్ ఉన్నారు.



కవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ శ్రీదేవి, రాధ

పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషాహాలోని కార్యాలయంలో శనివారం చార్మినార్ మండలానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కమలానగర్, ఉస్మాన్‌పుర, కట్టెలమండీ, ఫర్హత్‌నగర్, హరిలాల్ బాగ్, ఆజంపుర ప్రాంతాల వారికి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిహారిక, ఆర్‌ఐ మహ్మద్ యూనస్,రియాజ్, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి అదృశ్యం



నవీన్‌కుమార్

నాగోలు: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లింగోజిగూడ నివాసి కొలరియా నవీన్‌కుమార్(38) స్థానికంగా డెకరేషన్ సామగ్రి వ్యాపారం చేస్తున్నాడు. కొన్ని రోజులు క్రితం అప్పులు చేశాడు. వాటిని తీర్చే పరిస్థితి లేకపోవడంతో మనస్థాపానికి గురైన నవీన్‌కుమార్ ఈ నెల 20న ఇంట్లో వారికి చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో భార్య, ఇతర కుటుంబసభ్యులు స్థానికంగాను, ఇతర ప్రాంతాల్లోనూ వెతికినా నవీన్‌కుమార్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో భార్య పూజ గురువారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని కాలనీల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్ పేర్కొన్నారు. 9వ డివిజన్ నందిహిల్స్, టీచర్స్ కాలనీ, విజ్ఞానపురికాలనీల్లో రూ.42 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పెండ్యాల శివపార్వతితో కలిసి శనివారం మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభి వృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ అల్లూరి వాణి, కార్పొరేటర్లు నర్సింహ, కీసర గోవర్ధన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భీంరాజ్, కాలనీవాసులు విజయ్‌కుమార్, హన్మంతరెడ్డి, విక్కీసాగర్, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

తాను మరణిస్తూ .. ఇతరుల జీవితాల్లో వెలుగు



సాయంతన్ బిస్వాస్ (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరి కొందరి జీవితాల్లో వెలుగు నింపాడో యువకుడు. ఎల్‌బీనగర్ కామినేని ఆసుపత్రి ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం ... పశ్చిమబెంగాల్ రాష్ట్రం హబ్రా మండలం గోబర్‌దంగాకు చెందిన సాయంతన్ బిస్వాస్ (24) నగరంలోని తుక్కుగూడ ప్రాంతంలో ఉంటూ హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 18వ తేదీ రాత్రి సుమారు 12 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తూ అసెంబ్లీ ప్రాంతంలోని మెట్రోపిల్లర్ వద్ద ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే అతడిని ఉస్మానియా ఆసుపత్రికి, ఆ తర్వాత అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సాయంతన్ బిస్వాస్ ఈనెల 20న బ్రెయిన్‌డెడ్ అయినట్టు కామినేని వైద్యులు ధ్రువీకరించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానంపై సాయంతన్ బిస్వాస్ తండ్రి శ్యాంసుందర్‌కు అవగాహన కల్పించగా, ఆయన ఒప్పుకున్నారు. దీంతో శుక్రవారం సాయంతన్ బిస్వాస్ లివర్, ఒక కిడ్నీని కామినేని ఆసుపత్రికి, మరో కిడ్నీని, సోమాజిగూడ యశోద ఆసుపత్రికి, కార్నియాలను సరోజినీదేవి కంటి ఆసుపత్రికి దానం చేశారు.

కటకటాల్లోకి విద్యాశాఖ లంచావతారులు

చంచల్‌గూడ: లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ విద్యా శాఖ అధికారులు, సిబ్బందిని శుక్రవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు తరలించారు. పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (ఆర్జేడీ) కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ. సాయిపూర్ణచందర్‌రావుతో పాటు సూపరింటెండెంట్ డి.జగ్జీవన్, జూనియర్ అసిస్టెంట్ సతీష్‌లు సీబీఎస్‌ఈ స్కూల్ అప్‌గ్రేడ్ కోసం పాఠశాల నిర్వాహకుడు శేఖర్ వద్ద రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. నిందితులను ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించింది. దీంతో శుక్రవారం రాత్రి నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆర్జేడీ కార్యాలయం నుంచి ఫైళ్లు కదలాలంటే ఏడీ పూర్ణచందర్ రావుకు తప్పనిసరిగా ముడుపులు అప్పజెప్పాల్సిందేనని, లేకుంటే ఫైళ్లను వెనక్కి పంపుతారనే ఆరోపణలు ఉన్నాయి.

ఈఎంఆర్‌ఐలో దరఖాస్తుల ఆహ్వానం

గౌలిపురా: ఈఎంఆర్‌ఐ హైదరాబాద్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సర్వీస్ ఫౌండేషన్‌లో హాస్పిటల్ కో ఆర్డినేటర్, జిల్లా మేనేజర్‌గా హైదరాబాద్ జిల్లాలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రోగామ్ మేనేజర్ జాన్ షాహీద్ షేక్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌ను తీసుకొని ఈ నెల 25న ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. హాస్పిటల్ కో ఆర్డినేటర్‌కు బీఎస్సీ నర్సింగ్, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ అర్హతలు కలిగి ఉండి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. జిల్లా మేనేజర్ కోసం బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో పాసై సంబంధిత రంగంలో 5 ఏళ్ల అనుభవం కలిగి ఉండాలన్నారు. కింగ్‌కోఠిలోని 108 రీజినల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వివరాలకు 90000 01674, 91000 49108లలో సంప్రదించవచ్చు.